నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
15 మే 2024
పేజీలు 8

**జర్మనీ**

కొవ్వొత్తి మైనాన్ని ఇంధనంగా వినియోగించిన రాకెట్‌ను జర్మనీ సంస్థ హింపల్స్ విజయవంతంగా ప్రయోగించింది. ఈ రాకెట్ పేరు ఎస్ఆర్75. ఆస్ట్రేలియా నుంచి ఈ ప్రయోగం జరిగింది. పారాఫిన్, ద్రవ ఆక్సిజన్‌లను ఇందులో వినియోగించారు. 250 కేజీల బరువున్న ఉపగ్రహాన్ని, 250 కిలోమీటర్ల ఎత్తు వరకు ఇది మోసుకెళ్లగలదు.

## క్రీడలు

**అమూల్**

- త్వరలో టీ-20 టోర్నీ అమెరికా వేదికగా జరగనున్నది. అమెరికా, దక్షిణాఫ్రికా క్రికెట్ జట్లకు స్పాన్సరర్‌గా భారత సంస్థ అమూల్ వ్యవహరించనుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి 29 వరకు ఈ పోటీ జరగనుంది.

**ఏషియన్ ఫుట్ బాల్ కాన్ఫెడరేషన్**

- ఏషియన్ ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ అండర్-23 కప్‌లో జపాన్ విజేతగా నిలిచింది. ఈ టోర్నీని ఆ దేశం గెలవడం ఇది రెండోసారి. తుదిపోరులో ఉజ్బెకిస్థాన్‌ను ఓడించింది. ఈ టోర్నీ ఖతార్‌లోని దోహాలో ఉన్న జస్సిం బిన్ హమద్ స్టేడియంలో నిర్వహించారు.






**మారిషస్‌కు బియ్యం**

- 14000 టన్నుల బాసుమతియేతర బియ్యాన్ని మారిషస్‌కు ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**కృత్రిమ మేధ యాప్**

- ఈజడ్ ట్యాక్స్ అనే సంస్థ కృత్రిమ మేధ ఆధారిత మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇది ఆదాయ పన్నును దాఖలు చేసేందుకు ఉద్దేశించింది. ఈ తరహా యాప్ రావడం భారత్‌లో ఇదే ప్రథమం.

**సీడీఎస్‌సీవో**

- దీని పూర్తి రూపం సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్. ఔషధాలను తయారు చేసే సంస్థలకు నిరభ్యంతర సర్టిఫికెట్‌ను జారీ చేసే అధికారం సెంట్రల్

## జాతీయం

డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్‌కు ఉంది. మే 15 నుంచి ఇది అమల్లోకి రానుంది. భారతదేశంలో ఔషధాల నియంత్రణలో ఈ సంస్థ కీలక పాత్రను పోషించనుంది. కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఇది పని చేస్తుంది.

**సంప్రదాయాలు కీలకం**

- హిందూ వివాహానికి సంబంధించి సుప్రీం కోర్ట్ కీలక తీర్పు చెప్పింది. వివాహాల్లో పాటించే వేడుకలు అన్ని ముఖ్యమైనవే అని, ఆ తరహా వివాహాలే హిందూ వివాహ చట్టం ప్రకారం నమోదవుతాయని



పేర్కొంది. ఈ వేడుకలు చేయకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవడం చట్ట ప్రకారం చెల్లదని వెల్లడించింది. 1955లో పార్లమెంట్ హిందూ వివాహ చట్టాన్ని రూపొందించింది.

**డ్రిప్ ప్రైసింగ్**

- ఒక ఉత్పత్తిని విక్రయించేందుకు తక్కువ ధరను చూపి తర్వాత ఎక్కువ వసూలు చేయడాన్ని డ్రిప్ ప్రైసింగ్ అంటారు. సర్వీస్ చార్జి లేదా ఇతర అంశాలను ప్రస్తావిస్తూ చెప్పిన దాని కంటే ఎక్కువ ఖరీదును వసూలు చేస్తారు. ఇలా చేయడం వినియోగదారులను మోసం చేయడమే. డ్రిప్ ప్రైసింగ్‌కు పాల్పడితే ఎన్‌సీహెచ్ 1915లో ఫోను ద్వారా లేకా వాట్సప్ ద్వారా 88000 01915ను సంప్రదించవచ్చు.

**చక్రాలపై పాఠశాల**

- ఇటీవల కాలంలో మణిపూర్ రాష్ట్రంలో హింస చోటు చేసుకోవడంతో చాలా మంది శరణార్థుల శిబిరాల్లో రక్షణ పొందుతున్నారు. ఇక్కడే ఉంటున్న విద్యార్థుల కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం 'చక్రాలపై పాఠశాల' కార్యక్రమాన్ని చేపట్టింది.

## తెలంగాణ

**నగరి బీరప్ప**



- హైదరాబాద్‌లోని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్పకు ప్రతిష్ఠాత్మక రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో ఫెలోషిప్ లభించింది. క్లిష్టంగా ఉండే శస్త్ర చికిత్సలను విజయవంతం చేయడం, అలాగే పేద రోగులకు సేవలు అందించినందుకు ఆయన దీన్ని సొంతం చేసుకున్నారు.

**జియా ఉద్దీన్**

- రాష్ట్ర ప్రజారోగ్య శాఖ ఈఎస్‌సీగా జియా ఉద్దీన్ బాధ్యతలను స్వీకరించారు.

**ఎమ్మెల్సీ ఎన్నిక రద్దు**

- దండే విఠల్ ఎన్నికను రద్దు చేస్తూ హైకోర్ట్ తీర్పు వెలువరించింది. అయితే విఠల్ ఉన్నత న్యాయస్థానానికి వెళ్లనుండటంతో నాలుగు వారాల పాటు తీర్పు అమలును నిలిపివేసింది.


## అంతర్జాతీయం

**ఐక్యరాజ్య సమితి**

- ఐక్యరాజ్యసమితికి చెందిన జనాభా-అభివృద్ధి కమిషన్ సమావేశానికి భారత్‌లోని పంచాయతీ రాజ్ వ్యవస్థలో భాగంగా ఉన్న మహిళలు హాజరయ్యారు. 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ: స్థానిక పాలనలో మహిళలు, భారత్ మార్గదర్శి' అనే అంశంపై ఈ సదస్సును నిర్వహించారు. 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో స్థానిక సంస్థలు పోషించాల్సిన పాత్రను ఇందులో చర్చించారు. జనాభా-అభివృద్ధి కమిషన్‌ను 1946లో ఏర్పాటు చేశారు. ఇందులో 47 దేశాలకు సభ్యత్వం ఉంది.

**ఏఐ స్పోక్స్ పర్సన్**

- కృత్రిమ మేధ సాంకేతికతతో పనిచేసే స్పోక్స్ పర్సన్‌ను ప్రపంచంలోనే తొలిసారి ఉక్రెయిన్‌లో అందుబాటులోకి తెచ్చారు. దీనికి విక్టోరియా షి అనే పేరు పెట్టారు. అధికారిక ప్రకటనలను ఈ సాంకేతికత ద్వారా విడుదల చేస్తారు.



**ఐఎంఎఫ్**

- ఆసియా-పసిఫిక్ ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నివేదికను విడుదల చేసింది. భారత్‌లో ప్రభుత్వ వ్యయం మూలంగా ఆర్థిక వృద్ధి బాగుందని అందులో పేర్కొంది. అలాగే ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని వెల్లడించింది. ఐఎంఎఫ్‌కు ప్రస్తుతం క్రిస్టలీనా జార్జీవా నేతృత్వం వహిస్తున్నారు. ఆమె బల్గేరియా దేశానికి చెందిన వారు.

**యూరోపియన్ యూనియన్**

- మహిళలపై హింస జరగకుండా ఒక చారిత్రాత్మక తీర్మానాన్ని 27 దేశాల కూటమి యూరోపియన్ యూనియన్ ఆమోదించింది. బలవంతపు వివాహాలు, సైబర్ పరిజ్ఞానాన్ని వినియోగించి మహిళల వేధింపులు తదితరాలు చేయకుండా ఈ తీర్మానం తోడ్పడుతుంది.

**ఓఈసీడీ**

- దీని పూర్తి రూపం ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్. దీన్ని ఆర్థిక సహకారం-అభివృద్ధి సంస్థగా చెప్పుకోవచ్చు. 2024-25 సంవత్సరానికి భారత వృద్ధిరేటును 40 బేసిస్ పాయింట్ల శాతం పెంచింది. 6.6% వృద్ధిరేటు ఉంటుందని అంచనా వేసింది.

**ఏషియన్-భారత్**

- ఏషియన్-భారత్ సీనియర్ అధికారుల 26వ సమావేశాన్ని మే 2, 3 తేదీల్లో నిర్వహించారు. భద్రత, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర అంశాలను చర్చించారు. ఏషియన్ కూటమిలోని దేశాలతో భారత్ ఈ తరహా సంబంధాలను మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించారు. గతంలో భారత ప్రధాని 12 అంశాలను ప్రతిపాదించారు. ఇవి పరస్పర సంబంధాలు బలోపేతం చేసుకొనేందుకు ఉద్దేశించినవి. త్వరలో లావోస్ రాజధాని వియాంటియానేలో జరిగే సమావేశంలో ఈ 12 అంశాలను చర్చించాలని నిర్ణయించారు.

**స్పేస్‌క్రాఫ్ట్**

- చంద్రుడిపైకి మానవ రహిత స్పేస్‌క్రాఫ్ట్‌ను చైనా ప్రయోగించనుంది. రెండు నెలలు సాగే మిషన్ ఇది. చంద్రుడి అవతలి వైపు నుంచి రాళ్లు, భూ నమూనాలను సేకరిస్తుంది. ఈ తరహా సేకరణ చేపట్టనున్న ప్రపంచ తొలి దేశం చైనా.

**పాకిస్థాన్‌లో యోగా**

- అధికారికంగా యోగా తరగతులను పాకిస్థాన్‌లో ప్రారంభించారు. ఆ దేశ రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థకు చెందిన క్రీడ-సాంస్కృతిక విభాగం ఇస్లామాబాద్‌లో యోగా తరగతులను ప్రారంభించింది.




**రూ.వంద నోటు**

- కొత్త రూ.100 నోటును తీసుకురావాలని నేపాల్ ప్రభుత్వం నిర్ణయించింది. లిపులేక్, కాలాపాని, లింపియధౌర వంటి వివాదాస్పద ప్రాంతాలను ఆ నోటుపై ముద్రించాలని కూడా నిర్ణయం తీసుకుంది. ఆ దేశ ప్రధాని పుష్పకమల్ దహాల్ నేతృత్వంలోని క్యాబినెట్ దీన్ని ఆమోదించింది. ఈ నోట్లను చలామణిలోకి తెచ్చేందుకు సుమారు ఒక సంవత్సరం సమయం పట్టవచ్చు. 2020, మే నెలలో సైతం ఇదే విధంగా వివాదాస్పదంగా నేపాల్ దేశం ఒక రాజకీయ పటాన్ని విడుదల చేసింది. కాలాపాని, లింపియాధురా, లిపులేక్‌లను తమవిగా అందులో పేర్కొంది. భారత్‌కు, నేపాల్‌కు మధ్య పశ్చిమ సరిహద్దుగా కాళి నదిని సగౌలీ అనే ఒప్పందం పేర్కొంది. ఈ ఒప్పందం 1816లో బ్రిటిష్ ఇండియా, నేపాల్‌ల మధ్య కుదిరింది. అయితే కాళి నదీ ప్రవాహంలో తేడాలతో ఇబ్బందులు వస్తున్నాయి. తొలిసారి 1998లో ఈ సమస్య తెరపైకి వచ్చింది.

**దక్షిణాఫ్రికా**

- దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష అంతరించి 2024, మే 10 నాటికి 30 సంవత్సరాలు పూర్తయ్యింది. 1948 నుంచి ఆ దేశ పౌరులు జాతి వివక్షతో ఇబ్బందులు పడ్డారు. ఓటు హక్కుతో పాటు విద్య, ఉద్యోగ, వైద్య సౌకర్యాలను పొందే అవకాశం వివక్షకు గురైన నల్లజాతీయులకు దక్కలేదు. దీన్ని ప్రతిఘటిస్తూ నెల్సన్ మండేలా నేతృత్వంలో తీవ్ర స్థాయిలో పోరాడారు. జాతి వివక్షతోనే 1893లో మహాత్మాగాంధీని రైలు నుంచి దింపివేశారు. దక్షిణాఫ్రికాలోని పీటర్ మారిట్జ్‌బర్గ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. 1894లో మహాత్మాగాంధీ నాటల్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేసి జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించారు.

**భారత్-నేపాల్**

- ఆడిటింగ్‌లో పరస్పర సహకారానికి భారత కాగ్ గిరీశ్ చంద్ర ముర్ము, నేపాల్ ఆడిటర్ జనరల్ తోయం రాయలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఐక్యరాజ్య సమితి ఎక్స్‌టర్నల్ ఆడిటర్ ప్యానెల్‌కు ఇప్పటికే భారత కాగ్ వైస్ చైర్మన్‌గా ఉన్న సంగతి తెలిసిందే.

## నియామకాలు

**అతను చక్రవర్తి**

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కు పార్ట్‌టైం చైర్మన్‌గా 'అతను చక్రవర్తి' కొనసాగనున్నారు. మూడేండ్లు ఆయన ఈ బాధ్యతలో ఉండేందుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. మే 5న ఈ నియామకం అమల్లోకి వచ్చింది.

**కరీనా కపూర్**

- యునిసెఫ్ భారత జాతీయ రాయబారిగా బాలీవుడ్ నటి కరీనా కపూర్ నియమితులయ్యారు.

**రౌల్ ములినో**

- అధ్యక్ష ఎన్నికల్లో రౌల్ ములినో విజయం సాధించారు. ఆయన రెలిజండో మెటాస్ పార్టీకి చెందిన వారు.

**మే 7**

- ఏటా మే 7న ప్రపంచ అథ్లెటిక్స్ రోజుగా నిర్వహిస్తారు. క్రీడలు ఆడేందుకు ప్రజలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించింది ఈ రోజు. ఈ ఏడాది ఇతివృత్తం 'వరల్డ్ మైల్ చాలెంజ్'. అలాగే రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి కూడా ఇదే రోజు. సాహిత్యంలో 1913లో నోబెల్ పొందారు. ఈ ఘనతను దక్కించుకున్న తొలి ఆసియా వాసి, తొలి యూరపేతర వాసి. భారత జాతీయ గీతం జనగణమన ను ఆయనే రాశారు. బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని రాయడంతో పాటు శ్రీలంక దేశ గీత రచనలో స్ఫూర్తినిచ్చారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిమను ఇటీవల వియత్నాంలో ఆవిష్కరించారు.

## రోజులు ప్రత్యేకతలు

**మే 4**



- ఏటా మే 4న బొగ్గు గని కార్మికుల రోజుగా నిర్వహిస్తారు. ఈ పరిశ్రమలో పని చేసేవాళ్ల జ్ఞాపకార్థం ఉద్దేశించిన రోజు ఇది. ప్రపంచంలో తొలి బొగ్గు గనిని స్కాట్లాండ్‌లో 1575లో ప్రారంభించారు. భారతదేశంలో దామోదర్ నదీ తీరాన రాణిగంజ్‌లో 1774లో తొలి బొగ్గు గనిని గుర్తించారు.

**మే 3**

- మే 3న అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'భూ గ్రహానికి పత్రికా రంగం: పర్యావరణ సంక్షోభ సమయంలో పాత్రికేయం'. ఈ రోజు సందర్భంగా యునెస్కో పత్రికా స్వేచ్ఛా అవార్డును పాలస్తీనా జర్నలిస్టులకు ప్రకటించింది. ఆ దేశంలో జరుగుతున్న హింసాత్మక సంఘటనలను ధైర్య సాహసాలతో రిపోర్టింగ్ చేస్తున్నందుకు పాత్రికేయులందరికీ కలిపి ఈ అవార్డును ప్రకటించారు.
- ఇదే రోజున రిపోర్టర్స్ విఠౌట్ బోర్డర్స్ అనే సంస్థ పత్రికా స్వేచ్ఛా ర్యాంకులను ప్రకటించింది. మొత్తం 180 దేశాలకు భారత్ 159వ స్థానంలో నిలిచింది. 2023లో భారత్ 161వ స్థానంలో ఉంది. భారత్ 31.28 మార్కులను సాధించింది. ఐదు అంశాల ఆధారంగా ఈ సూచీని రూపొందిస్తారు. రాజకీయాలు, చట్టబద్ధమైన నిర్మాణం, ఆర్థిక, సామాజిక-సంస్కృతి, భద్రత అనే ప్రమాణాలు ఇందులో ఉన్నాయి. తొలి మూడు స్థానాల్లో నార్వే, డెన్మార్క్, స్వీడన్ ఉన్నాయి. చివరి స్థానంలో ఎరిత్రియా నిలిచింది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

